సాక్షి
బాపట్ల
మంగళవారం । 20 । జూన్ । 2023



పిడుగురాళ్లలో భారీ వర్షం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో సోమవారం గంటపాటు భారీ వర్షం కురిసింది. రైతులు, ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



క్రికెట్‌లో మరింత రాణించాలి

నగరంపాలెం(గుంటూరు): క్రికెట్ పోటీల్లో మరింత రాణించాలని ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్ అన్నారు. కార్పొరేట్ క్రికెట్ లీగ్-2023 విజేత జట్టు సోమవారం ఎస్పీని కలిసింది.



రైల్వేగేటును ఢీకొట్టిన ట్రాలీ ఆటో

మంగళగిరి: నగరంలోని నిడమర్రు రోడ్డులో ఉన్న రైల్వేగేటును ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో గంటకు పైగా వాహన రాకపోకలు నిలిచిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది.

న్యూస్‌రీల్

జూలై 22న ప్రత్యేక లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూలై 22వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.వెంకట నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

యార్డుకు 53,233 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 53,233 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 50,453 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.11,000 నుంచి 24,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి రూ.24,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,351 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.


పల్నాడు కలెక్టరేట్‌లో ఎడ్యుకేషనల్ సెల్ ఏర్పాటు

నరసరావుపేట: జిల్లాలో పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు సోమవారం నుంచి వారం రోజుల పాటు పైచదువులు చదువుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందించడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించే విధంగా కలెక్టరేట్‌లో 'ఎడ్యుకేషన్ సెల్' ఏర్పాటుచేసినట్లు ఎల్.శివశంకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సింగ్ నరసింహారావును గుంటూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాపట్ల జిల్లాకు సంబంధించి క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా పట్టెం మనోహర్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.10 అడుగుల వద్ద ఉంది. ఇది 149.4580 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.10 అడుగుల వద్ద ఉంది. ఇది 33.8136 టీఎంసీలకు సమానం.

రేపు వైద్య సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్

గుంటూరుమెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి జనరల్ ట్రాన్స్‌ఫర్స్ కౌన్సెలింగ్ బుధవారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. లాంగ్‌స్టాండ్ అభ్యర్థుల వివరాలు, రిక్వెస్ట్ బదిలీ కోరుకున్న వారి వివరాలన్నీ గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అన్ని క్యాడర్ల అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

మామూళ్ల కస్టాల్

- గుంటూరు రైల్వేస్టేషన్‌లో చిరువ్యాపారుల దైన్యం
- ప్రతినెలా రూ.లక్షల్లో మామూళ్లు వసూలు
- చొక్కా గుండీ పెట్టుకోలేదంటూ ముగ్గురు వెండర్లకు థర్డ్ డిగ్రీ
- ఆర్పీఎఫ్ అధికారి జులుం
- ఉన్నతాధికారికి వ్యాపారుల ఫిర్యాదు
- స్టాల్స్‌ను మూసివేసి నిరసన
- అవస్థలు పడిన ప్రయాణికులు



గుంటూరు రైల్వే స్టేషన్‌లో మూసివేసిన స్టాల్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు రైల్వేస్టేషన్‌లో అంతా ఆయన ఇష్టం.. ఎవరు వ్యాపారం చేయాలన్నా ఆయనకు మామూలు ముట్టజెప్పాల్సిందే. లేకపోతే థర్డ్ డిగ్రీ కోటింగ్ తప్పదు. ఇదీ గుంటూరు రైల్వే స్టేషన్‌లో కొన్నాళ్లుగా సాగుతున్న ఆర్పీఎఫ్ అధికారి దందా. తనకు ఇస్తున్న మామూళ్ల గురించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారన్న అక్కసుతో ఆదివారం చిరువ్యాపారుల వద్ద పనిచేసే నలుగురు వెండర్లను స్టేషన్‌కు తీసుకువెళ్లి ఆయన తీవ్రంగా కొట్టడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే..

ఆర్పీఎఫ్ సీఐ, మరో కానిస్టేబుల్ కలిసి..

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు పూర్తి భద్రతనిచ్చేందుకు ఏర్పాటు చేసిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ గుంటూరులో రైల్వే పేమెంట్ ఫోర్స్‌గా మారింది. ఆర్పీఎఫ్ సీఐ, మరో కానిస్టేబుల్ కలిసి స్టాల్స్ నుంచి మామూళ్లు వసూలు చేయడం, ఇవ్వకపోతే వారిపై కేసులు బనాయించడం చేస్తున్నారు.

లైసెన్స్ గుర్తింపు కార్డు లేదని..

గుంటూరు స్టేషన్‌లో ఒకటి నుంచి ఏడు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. వాటిలో 13 స్టాల్స్ ఉన్నాయి. వీటిని వివిధ వ్యక్తులు టెండర్ ద్వారా ఐదేళ్లకు పాడుకున్నారు. ప్రతిస్టాల్‌కు సుమారుగా రూ.12 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకూ టెండర్ డిపాజిట్ చేశారు. ప్రతిస్టాల్‌కు నాలుగు వెండింగ్ పర్మిట్‌లు, 12 వెండింగ్ గుర్తింపు కార్డులు కమర్షియల్ విభాగం సీనియర్ డీసీఎం అందిస్తారు. రోజుకు మూడు షిఫ్ట్‌లకు ప్రతిషిఫ్ట్‌కు నలుగురు చొప్పున 12 మంది గుర్తింపు కార్డులు ఉన్న వెండర్లు ఉంటారు. అయితే 12 మంది చేయాల్సిన పనిని 6 గురు మాత్రమే చేస్తున్నారు. వారిలో నలుగురికి మాత్రమే వెండింగ్ లైసెన్స్ గుర్తింపు కార్డులు ఉన్నాయి. మిగిలిన ఇద్దరికి లైసెన్స్ గుర్తింపు కార్డుకు బదులుగా సాధారణ గుర్తింపు కార్డులు ఉంటాయి. వీరికి లైసెన్స్ గుర్తింపు కార్డులు లేనందున ఆర్పీఎఫ్ సీఐ, కానిస్టేబుల్ 13 స్టాల్స్‌కు సంబంధించి ప్రతినెలా రూ.నాలుగు వేల నుంచి రూ.తొమ్మిది వేల వరకూ వసూలు చేస్తున్నారు. అదీగాక నెలలో ఐదు, ఆరు సార్లు ఆర్పీఎఫ్ సీఐ బంధువులు, ఉన్నతాధికారులు వస్తున్నారంటూ బిర్యానీ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు తినుబండారాలు తీసుకెళ్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అలాగే బయట వ్యక్తుల చేత సీఐ రైల్వే స్టేషన్‌లో వ్యాపారం చేయించి వారి వద్ద కూడా ప్రతి నెలా డబ్బులు తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎలాంటి ఫిర్యాదూ రాలేదు

గుంటూరు రైల్వే స్టేషన్‌లో వెండర్స్ సోమవారం స్టాల్స్‌ను మూసి వేసిన విషయం, ఆర్పీఫ్ సీఐ రామయ్య, కానిస్టేబుల్ రాంబాబు చేస్తున్న వసూళ్లపై నాకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు. సోమవారం గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలోని సీనియర్ డీసీఎంకు వెండర్స్ ఫిర్యాదు చేశారని తెలిసింది. సీనియర్ డీసీఎం పిలుపు మేరకు రైల్వే ఆర్పీఎఫ్ ఏసీఎం స్టేషన్‌కు వెళ్లారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం.

– సత్యహరప్రసాద్, గుంటూరు రైల్వే డివిజన్ సెక్యూరిటీ కమిషనర్

15 రోజులుగా తీవ్ర వేధింపులు


సీఐ కొట్టడంతో గాయపడిన వెండర్

ఇదిలా ఉంటే 15 రోజుల క్రితం రైల్వే స్టేషన్‌లో సీబీఐ అధికారులు లైసెన్స్ వెండర్లు లేని స్టాల్స్‌ను గుర్తించి వారి ఫొటోలు తీసుకుని రైల్వే ఐజీ గ్రూప్‌లో పెట్టారు. రైల్వే ఐజీ కార్యాలయ ఉన్నతాధికారులు గుంటూరు రైల్వే డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ హరప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. దీనికి సీఐ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడమే కారణమని తేల్చి ఆయనకు రెండు రోజుల జీతం కట్ చేశారు. దీంతో ఆగ్రహించిన సీఐ 15 రోజులుగా నెల మాములు ఇంకా పెంచాలంటూ వెండర్లను వేధిస్తున్నట్లు సమాచారం. ఈనెల 17న శనివారం చల్లా మహేష్ అనే వెండర్ చొక్కా గుండీ పెట్టుకోలేదని తీవ్రంగా కొట్టారు. ఆదివారం ఏసురాజు, సమర్‌పాల్, వికాస్ అనే వారిని గుర్తింపు కార్డు లేదంటూ స్టేషన్‌కు తరలించి వారిని తీవ్రంగా కొట్టి హింసించారు. దీంతో గుంటూరు రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వర్తించే లైసెన్స్ వెండర్స్, వారి వద్ద పని చేసే వారు మూకుమ్మడిగా సీఐ, ఆయన వద్ద పని చేసే కానిస్టేబుల్‌పై డీఆర్ఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సీఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం 13 స్టాల్స్‌ను మూసివేసి నిరసన తెలిపారు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఫలితంగా రైల్వే ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.

విద్యుక్త ధర్మం

- విద్యాశాఖలో క్షేత్రస్థాయి పర్యవేక్షణకు సర్కారు పెద్దపీట
- మండలానికి ఇద్దరు ఎంఈఓలు చొప్పున నియామకం
- ఒకరు పరిపాలనకు, మరొకరు పర్యవేక్షణకు..

గుంటూరు ఎడ్యుకేషన్: క్షేత్రస్థాయిలో అత్యంత కీలకమైన మండల విద్యాశాఖాధికారుల(ఎంఈఓల)కు విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుంది. రెండో ఎంఈఓ పోస్టులను సృష్టించింది. ఆ మేరకు నియామక ప్రక్రియ కూడా పూర్తి చేసింది. ఫలితంగా ఉపాధ్యాయ, విద్యావర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తగ్గనున్న పనిఒత్తిడి

క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ, విద్యారంగ కార్యక్రమాల అమలు, కార్యాలయ వ్యవహారాలతో ఎంఈఓలపై తీవ్ర పనిఒత్తిడి ఉంది. దీనిని గుర్తించిన సర్కారు రెండో ఎంఈఓ నియామకానికి శ్రీకారం చుట్టింది. దీనివల్ల ఒకరు క్షేత్రస్థాయి పాఠశాలలపై పర్యవేక్షణతో విద్యారంగ కార్యక్రమాల అమలు పనులు నిర్వర్తిస్తే మరొకరు పరిపాలన కార్యక్రమాలు చూసే అవకాశం కలుగుతుంది. ఫలితంగా పనిభారం తగ్గుతుంది.

ఒక్కపోస్టు మినహా భర్తీపూర్తి

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాలతో పాటు గుంటూరు నగర పరిధిలో అదనంగా మరొక పోస్టును కలుపుకుని మొత్తం 58 ఎంఈఓ-2 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆదివారం గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ పి.శైలజ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఒక్క వెల్దుర్తి మండలం మినహా మిగిలిన 57 మండలాల్లో ఎంఈఓ-2ల నియామకాన్ని కౌన్సెలింగ్ ద్వారా పూర్తి చేశారు.

ప్రయోజనాలు ఇవీ..

- ఇద్దరు ఎంఈఓల విధానం వల్ల క్షేత్రస్థాయి పర్యవేక్షణ సులభతరమవుతుంది.
- విద్యాపథకాలు జగనన్న అమ్మఒడి, విద్యా కానుక, గోరుముద్ద, మనబడి నాడు-నేడు కార్యక్రమాలు సమర్థంగా అమలవుతాయి.
- ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, రెన్యూవల్ అనుమతులు, వాటిపై నియంత్రణ సాధ్యమవుతుంది.
- ఉపాధ్యాయుల నెలవారీ వేతన బిల్లుల సమర్పణ, ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపడం, కార్యాలయంలో ఆన్‌లైన్ పనులు సులభతరమవుతాయి.
- ఒకరు పర్యవేక్షణ, మరొకరు పరిపాలన వ్యవహారాలు నిర్వర్తించే వెసులుబాటు ఉంటుంది.
- ఎంఈఓ-2 పోస్టుల భర్తీ వల్ల ఖాళీ అయిన హెచ్‌ఎం గ్రేడ్-2 పోస్టులను సీనియారిటీ ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. దీంతో ఉపాధ్యాయవర్గాల్లో ఆనందం వెల్లువెత్తుతోంది.

ఇదో కొత్త ఒరవడి



రెండో ఎంఈఓల పోస్టులను మంజూరు చేయడం కొత్త ఒరవడి. చారిత్రాత్మక నిర్ణయం. ఇకపై విద్యా వ్యవహారాలు వేగవంతమవుతాయి. సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయి. మంచి పరిణామం.

– యేరువ థామస్‌రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్, జిల్లా అధ్యక్షుడు

సర్వీసు రూల్స్ పరిష్కారానికి కృషి భేష్



ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాలకు చెందిన ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్‌ను పరిష్కరించేలా సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేయడం మంచి పరిణామం. రెండో ఎంఈవో పోస్టుల ద్వారా ఎంఈఓలపై పనిభారం తగ్గుతుంది.

– బి. తిరుపాల్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా
- స్పందనలో 155 అర్జీలు స్వీకరణ


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్లఅర్బన్: జిల్లాలో స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 155 స్పందన అర్జీలు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల నుంచి వచ్చే అర్జీలు ప్రభుత్వం ఇచ్చిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. గడువులోగా పరిష్కరించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పందన పోర్టల్‌ను ప్రతి రోజూ పరిశీలించి సమస్యలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో రీ ఓపెన్ అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం వైఎస్సార్ పశు బీమా పథకం పోస్టర్స్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో విద్యుత్ ఎలక్ట్రానిక్ బైక్స్ స్టాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీ శివజ్యోతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, డీఎస్ఓ విలియమ్స్, జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

బాపట్లఅర్బన్: జిల్లాలో కుష్టువ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జాతీయ కుష్టు వ్యాధి నిర్ములనా కార్యక్రమం అమలుపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి బాధితులను గుర్తించడానికి ఈ నెల 26 నుంచి జులై 16వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయాలన్నారు. అనుమానం ఉన్న వారిని వైద్య అధికారుల వద్దకు తీసుకుని వెళ్లాలన్నారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఇవ్వడం జరుగుతోందన్నారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా కుష్టు నివారణ అధికారి సి.వి.రమాదేవి, డీపీఎంఓ డాక్టర్ రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి రాజ్‌దెబోరా, మలేరియా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ వందశాతం పూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియ నూరు శాతం పూర్తయింది. ఈనెల 12న పాఠశాలల పున:ప్రారంభం నాటికి 93 శాతంగా ఉన్న పాఠ్య పుస్తక పంపిణీ వారం రోజుల వ్యవధిలో నూరుశాతానికి చేరుకుంది. రాష్ట్రంలోని వివిధ ముద్రణా సంస్థల నుంచి వేసవి సెలవుల్లోనే పాఠ్య పుస్తకాల పంపిణీ చేపట్టిన ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లాకు అవసరమైన పుస్తకాలను సకాలంలో అందజేసింది. విద్యార్థులకు జగనన్న విద్యాకానుక స్టూడెంట్ కిట్లతో కలిపి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 3,607 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా 4,18,678 మంది విద్యార్థులకు అవసరమైన 30,67,307 పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయి. వీటిని మండల స్టాక్ పాయింట్లకు ఆర్టీసీ కార్గో బస్సుల్లో తరలించినట్టు జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక మేనేజర్ వి.వజ్రబాబు సోమవారం చెప్పారు.

బల్లికురవ ఎంఈఓ సస్పెన్షన్

బల్లికురవ: ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తూ ప్రతి పనికి సొమ్ము డిమాండ్ చేస్తున్న బల్లికురవ ఎంఈఓ బీ.వీరరాఘవయ్యపై పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీ సుబ్బారావు సోమవారం సస్పెన్షన్ వేటు విధించారు. అక్రమ డిప్యూటేషన్‌లు, తుఫాన్‌ల పేరిట వసూళ్లు ఉపాధ్యాయుల ఎల్ఐసీ ప్రీమియంలు కార్యాలయానికి పంపడంలో జాప్యం, ఉపాధ్యాయులు శిక్షణ సొమ్ము స్వాహా, కార్యాలయ ఖర్చుల పేరిట వసూళ్లు, విశ్రాంత ఉపాధ్యాయుల పెన్షన్ చెల్లింపులో చేతివాటం ప్రదర్శించారని యూటీఎఫ్ నేతలు జిల్లా కలెక్టర్, ఆర్జేడీ, డీఈవోలకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై గత నెల 20వ తేదీ స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆర్జేడీ విచారణ చేపట్టారు. విచారణలో పలువురు ఉపాధ్యాయులు విశ్రాంత ఉపాధ్యాయులు వీరరాఘవయ్య అవినీతిపై లిఖితపూర్వకంగా వివరించారు. విచారణ అనంతరం ఆర్జేడీ సస్పెన్షన్ వేటు వేశారు.

కౌలు గుర్తింపు కార్డుల జారీ వేగవంతం

- జూన్ 17 నాటికి 2,213 గుర్తింపు కార్డులు మంజూరు
- 'జగనన్న సురక్ష' కార్యక్రమంలోనూ అవకాశం


గుర్తింపు కార్డుల మంజూరుపై తెనాలిలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి శిక్షణ (ఫైల్)

తెనాలి: కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. 2023-24 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్ సమీపించటం, కౌలు ఒప్పందాలు జరుగుతుండటంతో దరఖాస్తులు వస్తున్నాయి. గుంటూరు జిల్లాలో ఈ సీజన్‌లో మొత్తం 37,228 కౌలు కార్డులు మంజూరు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే పంటకాల్వలకు ప్రభుత్వం సాగునీటిని లాంఛనంగా విడుదల చేయడం, మరో మూడు నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు రానుండడంతో కర్షకులు ఖరీఫ్ వ్యవసాయ పనుల సన్నాహాల్లో ఉన్నారు. ఇదే సమయంలో కౌలు ఒప్పందాలూ ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం కౌలుదారుల గుర్తింపు కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 37,228 కార్డుల మంజూరు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. తెనాలి డివిజన్‌లో 19,306 కార్డులు లక్ష్యం కాగా, గుంటూరు డివిజన్‌లో 17,922 కార్డులు మంజూరు చేయాలని ఆదేశాలు జారీచేశారు. కౌలు ఒప్పందాల్లో జాప్యం, భూమి యజమానులు అంగీకారపత్రం ఇవ్వకపోవటం, ఫలితంగా కౌలు రైతుల నుంచి దరఖాస్తులు రాకపోవటం వల్ల ప్రక్రియ కాస్త మందకొడిగా జరిగినా ప్రస్తుతం వేగం పుంజుకుంది. ఈనెల ఏడో తేదీ వరకు జిల్లాలో 529 కార్డులు మంజూరు కాగా, శనివారం నాటికి 2,213 కార్డులు జారీ చేశారు. గుంటూరు డివిజన్‌లో 871 కార్డులు ఉండగా, తెనాలి డివిజన్‌లో 1,342 కార్డులు అందజేశారు. అత్యధికంగా పొన్నూరు నియోజకవర్గంలో 516 కార్డులు ఇచ్చారు.

ఎంతో ప్రయోజనం

మార్కెట్లో ధాన్యానికి తగిన ధర లేనపుడు మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్ముకోవాలంటే కౌలురైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి. రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలన్నా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సహా ఇతర రాయితీలు అందాలంటే కార్డులు ముఖ్యమని తెలిసిందే. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కార్డులు లేని కౌలురైతులు నష్టపరిహారం పొందాలన్నా.. రైతు భరోసా ద్వారా లబ్ధి చేకూరాలన్నా.. గుర్తింపు కార్డు కావాల్సిందే. దీనికోసం కౌలురైతులు వ్యవసాయాధికారి, వీఆర్వో దగ్గరకెళ్లి తగిన ఫార్మాట్‌లో గుర్తింపుకార్డు కోసం నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. దగ్గర్లోని సచివాలయంలో దరఖాస్తులు తీసుకుని ఫొటోతో సహా వివరాలను పూర్తిచేయాలి. కౌలు ఒప్పందం ప్రకారం భూమి యజమాని నుంచి తెల్లకాగితంపై తీసుకున్న అంగీకార పత్రం సమర్పిస్తే సరిపోతుంది. దూరప్రాంతాల్లో ఉన్న భూమి యజమానులు అంగీకారపత్రాన్ని వాట్సాప్‌లో పంపినా పరిగణనలోకి తీసుకుంటామని తెనాలి తహసీల్దార్ కె.రవిబాబు వెల్లడించారు.

భూ యజమానుల వెనకడుగు

పలువురు భూమి యజమానులు అంగీకారపత్రం ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. 2019లో వచ్చిన చట్టం ప్రకారం భూమిని కౌలుకు తీసుకున్న రైతుకు 11 నెలలు మాత్రమే పంటపై హక్కు ఉంటుందని, ఆ తర్వాత ఆటోమేటిక్‌గా ఒప్పందం రద్దయిపోతుందని అధికారులు చెబుతున్నారు. భూమిపై ఏమాత్రం అధికారం ఉండదని, భూ యజమానులు ఈ వాస్తవాన్ని గ్రహించి, కౌలురైతులకు సహకరించాలని విజ్ఞప్తిచేస్తున్నారు. ఈనెల 23వ తేదీ నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా చేపడుతున్న 'జగనన్న సురక్ష' పథకంలోనూ కౌలురైతులకు గుర్తింపు కార్డుల అంశాన్ని చేర్చటం మరో విశేషం.

గుంటూరు జిల్లాలో కార్డుల జారీ లక్ష్యం ఇలా..

డివిజన్	కార్డుల సంఖ్య
తెనాలి	19,306
గుంటూరు	17,922
మొత్తం	37,228

సకాలంలో తీసుకుంటేనే ప్రయోజనం

కౌలురైతులు సకాలంలో గుర్తింపు కార్డులు తీసుకోవాలి. గతేడాది తెనాలి మండలంలో 2,800 గుర్తింపు కార్డులిచ్చాం. చాలామంది తీసుకోలేదు. నవంబరు/డిసెంబరు నెలల్లో ధాన్యం కొనుగోళ్ల సమయంలో కార్డులు కావాలని హడావుడి చేశారు. దీనివల్ల ప్రయోజనం లేదు. సీజన్ ముందు తీసుకుంటే అన్నిరకాల ప్రయోజనాలు దక్కుతాయి. భూ యజమానులు కూడా నిరభ్యంతరంగా అంగీకారపత్రాలు ఇవ్వొచ్చు. ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

– కె.రవిబాబు, తహసీల్దార్, తెనాలి

ప్రతి ఒక్కరి చెంత దిశ యాప్ ఉండాలి

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- జిల్లాలో 15మంది మహిళా పోలీస్‌లకు ప్రశంసాపత్రాలు అందజేత


మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: జిల్లాలోని ప్రతి ఒక్కరి చెంత దిశ యాప్ అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన దిశ యాప్ మెగా డ్రైవ్‌లో అధికశాతం దిశయాప్‌లు డౌన్‌లోడ్ చేయించిన మహిళా పోలీసులకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ వారి పరిధిలోని ప్రతి ఒక్కరి ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్‌చేసే విధంగా కృషిచేశారన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామ/వార్డు సచివాలయ మహిళా పోలీస్‌ల సమష్టి కృషితో ఫలితంగా బాపట్ల జిల్లా రాష్ట్రంలో రెండో స్థానం సాధించిందన్నారు. మన జిల్లాకి ఈ స్థానం దక్కటంలో కష్టపడిన మొదటి 15 మంది గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు ఇచ్చి అభినందించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖలో నిబద్ధతతో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రూపొందించిన దిశా యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏదైనా అనుకోని ఆపద ఎదురైనప్పుడు పోలీస్ వారి తక్షణ సహాయం కోసం దిశా యాప్ బటన్ ప్రెస్ చేసిన, మీ మొబైల్ ఫోన్ షేక్ చేసిన నిమిషాల్లోనే పోలీస్ వారి సహాయం మీకు అందుతుందన్నారు. మీరు ఏదైనా కొత్త ప్రదేశంలో ఉన్నప్పుడు మీకు సమీపంలోని సురక్షిత ప్రదేశాల వివరాలు, సమీపంలోని పోలీసుస్టేషన్లకు, సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నావిగేషన్‌లు, పోలీసు డైరెక్టరీ, అత్యవసర సమయాల్లో చేయాల్సిన ఫోన్ నంబర్లు, సామాజిక మాధ్యమాలు, రోడ్డు భద్రత వంటి ఆప్షన్లు దిశా యాప్‌లో పొందుపరిచారన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న వారు వీరే...

దాసరి దివ్యవాణి (చందోలు పీఎస్), నహీరా తబస్సుమ్ (చందోలు పీఎస్), లక్ష్మీశిరీష పరిశ (చందోలు పీఎస్), కుంచాల శివమ్మ (చుండూరు పీఎస్), బోరుగడ్డ లక్ష్మీ కళ్యాణి (చందోలు పీఎస్), గేరా నిర్మల (అమర్తలూరు పీఎస్), లీలావతి బొలగాని (చందోలు పీఎస్), నస్రీనున్నిసా (చందోలు పీఎస్), గుర్రం అనితకుమారి (చిన్నగంజాం పీఎస్), శ్రీరామ్ దీపిక (అద్దంకి పీఎస్), దొరపల్లి వేదవతి (చిన్నగంజాం పీఎస్), డి.శారద (చందోలు పీఎస్), వల్లభుని గౌతమి (అమర్తలూరు పీఎస్), పోలక వెంకట రాధ(మార్టూరు పీఎస్), చల్ల శాంతి(ఇంకొల్లు పీఎస్)లు ఉన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ పి.మురళీకృష్ణ, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి సీజే భరత్ పాల్గొన్నారు.

యూనియన్ కార్యాలయాన్ని ఖాళీ చేయించండి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయాన్ని ఖాళీ చేయించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) అధికారులకు గుంటూరు వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థిని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. యూనియన్ కార్యాలయంలో రాత్రి 9 గంటల వరకు కొందరు వ్యక్తులు ఉంటున్నారని, పీజీ వైద్య విద్యార్థులు రాత్రి వేళల్లో చదువుకుని వచ్చే సమయంలో యూనియన్ ఉద్యోగులు న్యూసెన్స్ చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఉన్న పోస్ట్ ఆఫీస్‌ను బలవంతంగా ఖాళీ చేయించి నిబంధనలకు విరుద్ధంగా యూనియన్ కార్యాలయానికి అప్పగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైద్య విద్యార్థుల వాహనాలు పార్కింగ్ చేసే ప్రదేశంలో యూనియన్ సభ్యులు కొంత మంది తమ వాహనాలపై కూర్చుని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, తమ వాహనాలను పాడు చేస్తున్నారని వెల్లడించారు. యూనియన్ సభ్యులు చేస్తున్న న్యూసెన్స్ గురించి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు, నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో సైతం గతంలో ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని లేఖలో వాపోయారు. రాష్ట్ర ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని సదరు వైద్య విద్యార్థిని ఫిర్యాదులో కోరారు. కాగా ఈ సంఘటనపై వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతిని 'సాక్షి' వివరణ కోరగా శనివారం తమకు ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

ఇదిగో మిల్లెట్స్ మెనూ..

మధుమేహం నియంత్రణకు అవకాశం

- జిల్లాలో పెరుగుతున్న షుగర్ వ్యాధిగ్రస్తులు
- చిరుధాన్యాలకు పెరిగిన ప్రాధాన్యం
- వెలుస్తున్న మిల్లెట్ ఫుడ్ కోర్టులు



సాక్షి, నరసరావుపేట: ఈ రోజుల్లో చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అన్ని వయసుల వారు షుగర్ వస్తోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులు ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఒక్కసారి మనం షుగర్ బారిన పడ్డామంటే దానికితగ్గ మందులు వాడటం ఎంత ముఖ్యమో, తగిన ఆహార నియమాలు పాటించడం కూడా అంతే ముఖ్యం. జంక్ ఫుడ్‌ను ఇష్టపడేవారు కూడా హెల్త్ ఈజ్ వెల్త్ అంటూ పోషకాహారాలు ఉన్న మిల్లెట్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతున్నారు. నగర, పట్టణవాసులు ఆసక్తి చూపుతున్నారు.

మిల్లెట్స్ ఫుడ్ వైపు మొగ్గు..

మధుమేహం, ఊబకాయం సమస్యలు ఉన్నోళ్లు తప్పనిసరిగా చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు, బరువును తగ్గేందుకు మిల్లెట్స్ వైపు మొగ్గు చూపుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ట్రెండ్‌కు తగినట్లుగా కొందరు హోటళ్ల నిర్వాహకులు సరికొత్త థీమ్స్‌తో రెస్టారెంట్లను ప్రారంభిస్తున్నారు. తక్కువ ధరలోనే పసందైన మిల్లెట్స్ ఆహారాన్ని అందిస్తున్నారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, ఊదలు, సామలు, అరికెలు, వరిగలు వంటి చిరుధాన్యాలతో చేసిన ఇడ్లీ, దోశ, వడ, ఉప్మా, పొంగల్ వంటి టిఫిన్లకు డిమాండ్ పెరుగుతోంది.

వీధి వీధిలో మిల్లెట్ ఫుడ్ కోర్టులు...

గతంలో వీధిలో తోపుడు బండ్లపైన బజ్జీలు, గారెల వంటి అల్పాహార దుకాణాలు అధికంగా కనిపించేవి. మారుతున్న ఆహారపు అలవాట్లలో భాగంగా వీధుల్లో ప్రస్తుతం చిరుధాన్యాలతో చేసిన ఇడ్లీ, దోశ, రొట్టెల బండ్లు దర్శనమిస్తున్నాయి. షుగర్ వ్యాధి కారణంగా చాలా మంది వరి అన్నం తినడం తగ్గించి, ఒక పూట జొన్నరొట్టెలు తింటున్నారు. దీంతో వీటికి ఆదరణ పెరిగింది. ఒకప్పుడు కిలో రూ.20కి లభించే కొర్రలు ఇప్పుడు రూ.70–90 మధ్యకు చేరుకున్నాయి. ఇలా ఇతర చిరుధాన్యాల వినియోగం పెరగడంతో గిట్టుబాటు ధర పెరిగి రైతులు చిరుధాన్యాలను పండించడం క్రమంగా పెరుగుతోంది. ఇందులో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేసే చిరుధాన్యాలను అధిక ధరలు వెచ్చించి మరీ కొనుగోలు చేస్తున్నారు.

అందరికి మంచిదే...



అన్నంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువ, ప్రోటీన్లు తక్కువగా ఉంటాయి. అదే చిరుధాన్యాలలో కార్బోహైడ్రేట్ల శాతం తక్కువ, శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు ఎక్కువగా లభిస్తాయి. దీంతో మధుమేహ వ్యాధిగ్రస్తులు చిరుధాన్యాలను తీసుకోవడం మంచిది. ఐతే చిరుధాన్యాలు మధుమేహం లేని వారు సైతం వినియోగించడం ఉత్తమం, దీని వల్ల రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారు. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం విద్యార్థులు, రోగులకు రాగిజావను అందజేస్తోంది.

– డా. బీవీ రంగారావు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ పల్నాడు జిల్లా.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- సిబ్బంది సమస్యల పరిష్కారమే ధ్యేయం
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ కుటుంబాలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ తన్నీరు వెంకటేశ్వర్లు భార్యకు ఫ్లాగ్ ఫండ్, విడో ఫండ్ చెక్కులు సోమవారం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తన్నీరు వెంకటేశ్వర్లు ఏప్రిల్ 17న గుండెపోటుతో మృతి చెందారని, ఆయన భార్య నాగలక్ష్మికి విడో ఫండ్ చెక్కు రూ.50 వేలు, ఫ్లాగ్ ఫండ్ చెక్కు రూ.25 వేల చెక్కులు అందజేశామన్నారు. పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఏదైనా సమస్య వచ్చినా, ఏ సహాయం కావాలన్నా నేరుగా తనను కలవాలన్నారు. తక్షణమే స్పందించి సహాయం అందించడానికి పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఓ బి.సెక్షన్ సూపరింటెండెంట్ కే.రాధిక పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఎస్పీ వకుల్‌జిందాల్


సమస్యలను ఎస్పీకి వివరిస్తున్న బాధితులు

బాపట్లటౌన్: స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 48 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్వయంగా ఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు వివరించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థికపరమైన అంశాలు, ఇతర సమస్యలను వివరించారన్నారు. బాధితుల సమస్యలు విన్న అనంతరం సంబంధిత సీఐ, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వహించినా, నెలల తరబడి బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పినా సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఇనుపరాడ్డుతో దాడి


రక్తపుమడుగులో కోటేశ్వరరావు

దాచేపల్లి: అనుమానం పెనుభూతమైంది. భార్యతో సన్నిహితంగా మాట్లాడుతున్నాడనే అనుమానంతో వ్యక్తిపై ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ దాసరి శివనాగరాజు అందించిన వివరాలు.. నారాయణపురంలో నివాసం ఉంటున్న మారబోయిన కోటేశ్వరరావుకు నెలరోజుల కిందట వివాహమైంది. అదే వీధిలో నివాసం ఉంటున్న బొమ్మనబోయిన శ్రీనివాసరావు భార్యతో కోటేశ్వరరావు సన్నిహితంగా ఉంటున్నాడనే అనుమానం కలిగింది. ఈ నేపథ్యంలో ఇంటి వద్ద ఉన్న కోటేశ్వరరావుతో శ్రీనివాసరావు, సోదరుడు నరసింహారావు, లక్ష్మి వాగ్వాదానికి దిగారు. వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో కోటేశ్వరరావు తలపై పదిసార్లు మోదారు. బాధితుడిని పిడుగురాళ్లలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ శివనాగరాజు పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

24న సత్తెనపల్లిలో మెగా జాబ్‌మేళా


కలెక్టరేట్‌లో మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర జలవనరుల మంత్రి అంబటి రాంబాబు సహకారంతో ఈనెల 24న సత్తెనపల్లిలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు పేర్కొన్నారు. సోమవారం జాబ్‌మేళా పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులతో కలసి ఆవిష్కరించారు. రఘురామ్‌నగర్‌లోని ప్రగతి కళాశాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30వరకు నిర్వహించే మెగా జాబ్‌మేళాను సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ కోరారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీ, హెటిరో డ్రగ్స్, వల్లభ మిల్క్ ప్రొడక్ట్స్, అపోలో ఫార్మసీ వంటి 17రకాల కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదివిన 18ఏళ్ల నుంచి 45ఏళ్లలోపు వయస్సున్న యువతీ, యువకులు బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలని సూచించారు. విద్యార్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.30వేల వరకు జీతం లభిస్తుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఏ.రమ్య (83285 44388), ఫిరోజ్ గాంధీ(70139 50097), ఖాదర్ బాష (94409 88148)ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీడీవో మహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాజేష్ (ఫైల్)

చీరాల: చికిత్స పొందుతున్న వ్యక్తికి రక్తం అవసరం కావడంతో తీసుకువచ్చేందుకు వెళ్తూ మార్గంమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ హృదయవిదారక ఘటన సోమవారం తెల్లవారుజామున చీరాల-కారంచేడు రోడ్డులో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఉడ్‌నగర్‌కు చెందిన తేళ్ల రాజేష్, రాధాగ్రేస్ దంపతులు. రాజేష్ ఒంగోలులో ఓ ప్రైవేటు బ్లడ్ బ్యాంకులో పనిచేస్తుండగా అతని భార్య ఆశ వర్కర్‌గా పనిచేస్తున్నారు. చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తికి రక్తం అవసరం కావడంతో తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై రాజేష్ చిలకలూరిపేట బయలుదేరాడు. చీరాల-కారంచేడు రోడ్డులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ట్రైరు బండి ఒక్కసారిగా ఆగడంతో వెనుక వస్తున్న రాజేష్ బైక్‌తో బలంగా ఢీకొట్టాడు. గుండె వద్ద బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 సాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆపద సమయంలో మరొకరి ప్రాణాలు కాపాడేందుకు వెళ్తూ తన ప్రాణాన్ని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి

గురజాల: పిడుగుపడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మాడుగుల గ్రామానికి చెందిన బత్తుల రాజు(35) సోమవారం మధ్యాహ్నం పొలంలో మేకలు కాస్తుండగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగు రాజుపై పడటంతో మృతి చెందాడు.

బేసిక్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ భవనం నాగకిశోర్, డీవీఎస్ఆర్‌కే చైతన్య రాసిన ' బేసిక్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ' పుస్తకాన్ని సోమవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. పుస్తక రచయితలు డాక్టర్ భవనం నాగకిశోర్, డీవీఎస్ఆర్‌కే చైతన్య మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లోని అన్ని బ్రాంచిల విద్యార్థులకు ఉపయోగపడుతుందని చెప్పారు. కృత్రిమ మేధస్సు, సమస్యల పరిష్కార పద్ధతులు, జ్ఞాన ప్రాతినిధ్యం, సాఫ్ట్‌వేర్ ఏజెంట్స్ తదితర అంశాల్ని కూలంకషంగా వివరించినట్లు చెప్పారు. ఎస్ఐపీ హెచ్ పబ్లికేషన్స్ ప్రచురించిందని తెలిపారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ పుస్తకాన్ని ఉపయోగించుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య స్వరూపరాణి, ఆచార్య గంగాధరరావు, ఆచార్య పి. సిద్ధయ్య, ఆచార్య శ్రీనివాసరెడ్డి, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్‌లో రూ.6212.39 కోట్ల వ్యాపారం

కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్


కరూర్ వైశ్యా బ్యాంక్ సత్తెనపల్లి శాఖను ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజకుమారి

సత్తెనపల్లి: కరూర్ వైశ్యా బ్యాంక్ విజయవాడ డివిజన్ 2023 మార్చి 31 నాటికి రూ. 6212.39 కోట్ల వ్యాపారం చేసిందని ఆ బ్యాంక్ డివిజనల్ మేనేజర్ కె.వి.ఎస్. ప్రసాద్ చెప్పారు. శాఖల విస్తరీకరణలో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో 803వ శాఖను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు డివిజనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో ప్రస్తుతం 52 శాఖలు ఉన్నాయని, సత్తెనపల్లి శాఖతో ఆ సంఖ్య 53కు చేరిందని తెలిపారు. బ్యాంక్ 1916లో రూ.లక్ష మూల ధనంతో స్థాపించబడిందన్నారు. 2023 మార్చి 31 నాటికి అది రూ.160.41 కోట్లకు చేరుకుందని, రూ.1106.09 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసిందని వివరించారు. డివిజనల్ ఆపరేషన్ ఆఫీసర్ ఐ.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేవీబీ డిజిటల్ బ్యాంకింగ్ సేవల్ని సత్తెనపల్లి పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ముందుగా కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన శాఖను, ఏటీఎంను సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి బి.ఎల్.ఎన్. రాజకుమారి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన ఏరియా వైద్యశాల వైద్యురాలు వై.వి. సుజాత చేపట్టగా, బ్యాంకు సేఫ్ రూంను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి

పీఏసీఎస్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

కొరిటిపాడు(గుంటూరు): సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ 2019 మార్చి 1వ తేదీ నుంచి వేతన బకాయిలు చెల్లించడంతోపాటు జీఓ నెం.36ను వెంటనే అమలుచేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పొలిమేర వెంకటరెడ్డి కోరారు. పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంక్ ప్రధానకార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)ఉద్యోగుల మాదిరిగానే పీఏసీఎస్ ఉద్యోగులకు కూడా సమాన డీఏ చెల్లించాలన్నారు. సహకార సంఘాలలో పనిచేస్తున్న సిబ్బందికి జీఓ నెం.36 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వలే విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. పీఏసీఎస్‌లో పనిచేస్తున్న పర్మినెంట్ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సహకార సంఘాల సీఈఓలకు 5వ కేడర్ పే స్కేలును, ఏఈఓలు, స్టాఫ్ అసిస్టెంట్స్‌కు 6వ కేడర్ పే స్కేలును, సబ్‌స్టాఫ్‌కు 7వ కేడర్ పే స్కేలు ఇప్పించాలన్నారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కూడా డీఎల్‌ఈసీ కమిటీ ద్వారా చెల్లించాలన్నారు. సంఘాల ఉద్యోగులను బదిలీ చేసే సమయంలో సహకార సంఘాల ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్‌ను సంప్రదించి బదిలీ చేయాలని సూచించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామంజనేయులు (లాలుపురం రాము)కు అందజేశారు. స్పందించిన బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము మాట్లాడుతూ పీఏసీఎస్ ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ నాయకులు మొవ్వా వెంకటేశ్వరరావు, బి.సాంబశివరావు, కె.కోటేశ్వరరావు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా 'భాష్యం'

ఇద్దరు జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్లకు రూ.10 లక్షలు చొప్పున బహూకరణ


శివరామ్, మణీందర్‌రెడ్డికి చెక్కులు అందజేసిన భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులైన విద్యార్థుల్ని ప్రోత్సహించడంలో భాష్యం ఎప్పుడూ ముందంజలో ఉంటుందని భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ చెప్పారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో టాప్–10 ర్యాంకుల్లో నిలిచిన ఇద్దరు విద్యార్థులకు సోమవారం గుంటూరులోని భాష్యం ప్రధాన క్యాంపస్‌లో ఆయన రూ.10 లక్షలు చొప్పున నగదు బహుమతుల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆలిండియా ఓపెన్ కేటగిరీ 5వ ర్యాంకర్ ఏ.వి.శివరామ్, 10వ ర్యాంకర్ వై.వి.మణీందర్‌రెడ్డి నిర్దేశిత లక్ష్యాల్ని చేరుకునేందుకు అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తామని చెప్పారు. జాతీయస్థాయిలో 10లోపు 5వ, 10వ ర్యాంకులు సాధించడం ద్వారా భాష్యం విద్యాసంస్థలు చరిత్ర సృష్టించాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓపెన్ కేటగిరీలో అత్యుత్తమ ర్యాంకుల్ని సాధించిన తమ విద్యార్థులు చరిత్ర తిరగరాశారని పేర్కొన్నారు. గతంలో తమ విద్యార్థులు 15వ ర్యాంకు సాధించగా, తాజాగా 10లోపు రెండు ర్యాంకులు సాధించడం ద్వారా చరిత్రను తిరగరాశారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు, భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్ట్


కార్తీక్‌ను అరెస్ట్ చూపుతున్న సీఐ శోభన్‌బాబు, సిబ్బంది

సత్తెనపల్లి: భార్యను హతమార్చిన భర్తను పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ యు.శోభన్‌బాబు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రెండో వార్డు 11వ లైన్‌లోని ఒంటిపులి అరుణపై అనుమానంతో ఆమె భర్త ఒంటిపులి కార్తీక్ ఈ నెల 7న అర్ధరాత్రి ఒంటి గంటకు గొంతు నులిమి హతమార్చాడు. దీనిపై కేసు నమోదు చేయగా సోమవారం నిందితుడి అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించటంతో నరసరావుపేట సబ్ జైలుకి తరలించారు.

వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నం

దాచేపల్లి: వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో 70 ఏళ్ల వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. వృద్ధురాలి ఇంటికి సమీపంలో పిచ్చయ్య(55) నివసిస్తున్నాడు. లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయటంతో పిచ్చయ్య పారిపోయాడు. జరిగిన ఘటన గురించి వృద్ధురాలు కుటుంబ సభ్యులకు తెలిపింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేయలేదు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

కాపాడిన లచ్చన్నగుడిపూడి గ్రామస్తులు



లచ్చన్నగుడిపూడి(తాడికొండ): నీటి కోసం వచ్చిన జింక కుక్కల దాడిలో గాయపడిన ఘటన తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడిలో జరిగింది. మోతడక అటవీ ప్రాంతం నుంచి సోమవారం ఓ జింక నీటి కోసం వచ్చి కుక్కల బారిన పడింది. వెంటపడి కరుస్తుండటంతో గ్రామస్తులు కాపాడి, రెవెన్యూ అధికారుల ద్వారా అటవీ అధికారులకు సమాచారం అందించారు. మోతడక అటవీ ప్రాంతంలో తాగేందుకు నీరు లేకపోవడంతో జింకలు కొండ దిగి జనవాసాల్లోకి వస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. అడవిలో నీటి గుంతలు ఏర్పాటు చేయాలని వారు అధికారుల్ని కోరుతున్నారు.